



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెసి రామసుందర్‌రెడ్డి

కొత్తగా ఏమీ లేదు..!

- ఫ్యామిలీ డాక్టర్‌లో 104 సేవలే - జిల్లాలో 25 ప్రాంతాల్లో ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

'ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చాం.. ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతాయి..' ఇదీ అధికారపక్ష నాయకులు ఊదరగొడుతోంది. కానీ ఆ విధానంలో కొత్తగా ఏమీ లేదు. గతంలో 104 ద్వారా అందుతున్న సేవలే ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందుతాయి. జిల్లాలో 25 ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభించారు..

ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చామని అధికార పార్టీ నాయకులు, అధికారులు చెబుతున్నారు. ఈ విధానం ద్వారా 104 వాహనం ద్వారా వైద్యుడు, వైద్య సిబ్బంది రోజుకో గ్రామానికి వెళ్లి వైద్య సేవలను అందిస్తారు. వైద్యులను పరీక్షించి మందులను అందిస్తారు. పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు వైద్యులను నియమించి ఒకరు పిహెచ్‌సిలో, మరొకరు ఈ 104 వాహనంలో గ్రామాలకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం 25 ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. జిల్లాలోని దేవనకొండ మండలం పి.కోటకొండలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గురువారం ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. ఈ విధానం కొత్తగా తీసుకొచ్చిందేమీ కాదు. గతంలో నుంచే అమలవుతోంది. 104 పేరుతో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించేవారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో అదే విధంగా వైద్య సేవలను అందిస్తున్నారు. నూతన విధానం కోసం 24 మంది వైద్యులను కొత్తగా నియమించారు. ఇంకా ఒక వైద్యుని పోస్టు ఖాళీగా ఉంది. ఈ విధానం కోసం కొత్తగా వైద్య సిబ్బందిని ఎవరినీ నియమించలేదు. గతంలో 104 వాహనంలో పని చేస్తున్న డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సేవలను యథావిధంగా ఉపయోగించుకుంటున్నారు. గతంలో 104 ద్వారా అందుతున్న సేవలకే పేరు మార్చి ప్రచార ఆర్భాటం ప్రదర్శించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పి.కోటకొండలో వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు (ఫైల్)

ఫ్యామిలీ డాక్టర్ అంటే..

ఫ్యామిలీ డాక్టర్ అంటే కుటుంబ వైద్యుడు అని అర్థం. ఒక కుటుంబానికి ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆ వైద్యుడిని సంప్రదించాలి. ఆ వైద్యుడు వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఆ ఊరిలోనే నివాసం ఉండాలి. ఒక వేళ ఊరిలో లేకపోయినా ఫోన్ ద్వారా అయినా అందుబాటులో ఉండాలి. అవసరమైన వైద్య సలహాలు అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యుడు గ్రామంలో అందుబాటులో ఉండరు. వాహనంలో వచ్చి వైద్య సేవలు అందించి వెళ్లిపోతారు.

గ్రామాల్లో వైద్య సేవలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు గ్రామాల్లో వైద్య సేవలను అందిస్తారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు వైద్యులు ఉంటారు. ఒకరు పిహెచ్‌సిలో ఒపి చూస్తారు. మరొకరు 104 వాహనంలో వెళ్లి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తారు. గ్రామంలో ఎవరైనా రాలేని పరిస్థితిలో ఉంటే వారి ఇంటికే వెళ్లి వైద్య సేవలను అందిస్తారు.

- రామగిడ్డయ్య, డిఎంహెచ్‌ఒ.

జెసిగా బాధ్యతలు చేపట్టిన వికాస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వికాస్ మర్మత్ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నూతన జాయింట్ కలెక్టర్ వికాస్ మర్మత్ బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కడప జిల్లాలో ట్రైనీ కలెక్టర్ గాను, శ్రీకాకుళం జిల్లా టెక్కలి లో సబ్ కలెక్టర్ గా విధులు నిర్వహించి అడిషనల్ డైరెక్టర్ గ్రామ సచివాలయ, వార్డు సెక్రటరీ డిపార్టులో విధులు నిర్వహించానన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జెసి రామసుందర్ రెడ్డి నుండి బాధ్యతలు స్వీకరించానని అన్నారు. అంతకుముందు కలెక్టర్ పి.కోటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించానని అన్నారు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ వాసి అయిన వికాస్ మర్మత్ కాన్పూర్ ఐఐటిలో 2017లో బిటెక్ పూర్తి చేసి సోషియాలజీ ఆప్షనల్ గా 2018లో ఐఎఎస్ ఎంపిక అయ్యానన్నారు. మొదటి ప్రయత్నంలోనే 473 దేశస్థాయిలో ర్యాంకు సాధించి ఐఎఎస్ అర్హత సాధించానని, రాజస్థాన్ రాష్ట్ర నుంచి ఐఎఎస్ కు ఎంపికైన జెసి వికాస్ మర్మత్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఐఎఎస్ అధికారిగా కేటాయించారు. ఆయన తండ్రి గుజరాత్ రాష్ట్రంలో గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ డిపార్టుమెంటులో అధికారిగా పనిచేస్తున్నారు. కర్నూల్ డిఆర్‌ఒ నాగేశ్వరరావు, ఆర్‌డిఒ హరి ప్రసాద్, కర్నూలు తహసిల్దార్ శివ రాముడు తదితరులు జాయింట్ కలెక్టర్‌కు స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి వికాస్ మర్మత్



నిరసన చేపడుతున్న నాయకులు

'మాంటిస్సోరీ'పై చర్యలు

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, విద్యాశాఖ మినిస్టర్ ఆదేశాలను బేఖాతరు చేసి గుడ్ ఫ్రైడే సెలవు దినాలలో కూడా పాఠశాల నడుపుతున్న మాంటిస్సోరి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్కూల్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుడ్ ఫ్రైడే, ఈస్టర్, బక్రీదు జాతీయ సెలవు దినాలుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేసిన దాన్ని లెక్కచేయకుండా డిఇఒను చేతిలో పెట్టుకొని డిఇఒ ఆర్డర్ ప్రకారమే తాము స్కూల్ నడుపుతున్నామని అన్నారన్నారు. అలాంటప్పుడు స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ప్రకటనలు తప్పా లేక డిఇఒ ఆర్డర్లో వాస్తవం ఉందా? ప్రశ్నించారు. ఏ అధికారితో సంబంధం లేదు ఏం చేసుకుంటారో చేసుకోపోండి అనే రకంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థి సంఘాలతో ప్రవర్తించడం చాలా దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కర్నూల్ నగరంలో మాంటిస్సోరి ఏ క్యాంప్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిఇఒకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన పట్టించుకోలేదన్నారు. గతంలో అక్రమ అడ్మిషన్ లపై ఫిర్యాదు చేశామనా, అది కూడా పట్టించుకోలేదని, ఇక్కడ స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఏమిటంటే డిఇఒ ప్రైవేట్ స్కూళ్లకు కొమ్ము కాస్తున్నారన్నారు. ఈవిషయంలో డిఇఒ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షులు అమర్, నగర నాయకులు శ్రీను, చరణ్, నందు పాల్గొన్నారు.

అదాని అవినీతిపై విచారణ ఎందుకు జరపరు

- సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అదాని అవినీతిపై విచారణ కమిటీ వేయమంటే ఎందుకు మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గుతుందని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఆదాని అవినీతిని బయట పెట్టినందుకు ఆయనపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించేందుకు కుట్ర చేశారని విమర్శించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని సిఆర్ భవన్‌లో సిపిఐ జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. జైలు శిక్ష పడిన రాహుల్ గాంధీ హీరో అయ్యాడని ఆయన వెనక్కి తగ్గకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతి పక్ష పార్టీలు 22 ఏకమై ఢిల్లీలో నిరసన ర్యాలీ నిర్వహించాయన్నారు. మోడీ ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై కేసులు పెడుతూ అరెస్టు చేయిస్తూ వారికి అనుకూలంగా ఉన్న వారిని రక్షిస్తూ ఉందన్నారు. ఆదాని అవినీతిపై విచారణ కమిటీ వేయమంటే వేయకుండా ఎందుకు జంకుతున్నారు. తొమ్మిదేళ్లలో మోడీ ఏమి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు అన్ని ఏకమై మోడీని ఓడించాలన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏవైనా నెరవేర్చావా అని ప్రశ్నించారు. కొత్త పరిశ్రమలు తీసుకురాగా పోగా ఉన్న పరిశ్రమలు కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. 11న చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి

- గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లాలి

- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బివై.రామయ్య

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

ప్రజలకు మరింత చేరవయ్యేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారని అభివృద్ధి చేయడంలో దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోయారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బివై రామయ్య అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం జగనన్న సైనికులు గృహ సారథులు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి వివరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో 14 రోజులు నిర్వహిస్తామని అన్నారు. ప్రతి కార్యకర్త వైసిపి ఇన్చార్జీలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.60 కోట్ల కుటుంబాలను నేరుగా కలుసుకునే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి నేటి నుంచి వైసిపి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇందులో భాగంగానే కర్నూలు నగరంలో దాదాపు 5 లక్షలకు పైగా ఉన్న ప్రజలను కలుసుకొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను గురించి తెలియజేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7 లక్షల మంది గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు 1.60 కోట్ల ఇళ్లను 14 రోజుల్లో సందర్శించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని ఇందులో భాగంగానే కర్నూలు నగరంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈనె 7 నుంచి 20 వరకు జగనన్నే మా భవిష్యత్తు అనే పేరుతో క్యాంపెయిన్ చేస్తామన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి క్లుప్తంగా వివరించాలని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



పాస్టర్లను బెత్లెహేము చూపిస్తా : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏసుక్రీస్తు పుట్టిన పవిత్ర ప్రదేశం అయినా బెత్లెహేము వెళ్లేందుకు ఆసక్తి కలిగిన పాస్టర్లను, పేద ప్రజలను అక్కడికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి.భరత్ హామీ ఇచ్చారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా నగరంలోని పలు చర్చిలను ఆయన సందర్శించారు. చర్చిలలో ప్రార్థనలు చేశారు. టిజి. భరత్ మాట్లాడుతూ ఏ మతమైనా ఎదుటి వారికి మంచి చేయాలనే చెబుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఏసుక్రీస్తు పుట్టిన బెత్లెహేము వెళ్లాలని ఆశగా ఉంటుందని.. అయితే అది అంత ఈజీ కాదని అన్నారు.టిడిపి వచ్చిన వెంటనే తాను చొరవ తీసుకొని బెత్లెహేము తీసెకెళ్తానని హామీ ఇచ్చారు. మంచి పనులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రజలందరి దీవెనలు తనపై ఉండాలని కోరారు. స్టాంటన్ చర్చిలో టిడిపి నేత సురేంద్ర ఏర్పాటు చేసిన అన్నదానాన్ని భరత్ ప్రారంభించారు. టిడిపి నేతలు గున్న మార్కు, రామాంజనేయులు, నాగరాజ్ యాదవ్, అబ్బాస్, బొల్లెద్దుల రామకృష్ణ, జూటూరు రవి, రాజ్ కుమార్, ప్రసాదరావు, వినోద్ చౌదరి, శ్రీధర్, యేసు, ఈశ్వర్, సురేంద్ర, శివ, దాస్, పెంచులయ్య, రంజిత్, అజయ్ పాల్గొన్నారు.

6 నుంచి ఇంటింటికి ఒబిసి మోర్చా

ఒబిసి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఒబిసి జాతీయ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుండి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 14 వరకు ప్రతి ఇంటికి ప్రతి గ్రామానికి ఒబిసి మోర్చా నాయకులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ పథకాలు విధానాలు బిసిలకు చేసిన అన్యాయాన్ని ఎండగడతారని ఒబిసి మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్థసారథి ప్రకటించారు. శుక్రవారం బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక బిసి కార్పొరేషన్‌గా ఉన్న దానిని 56 కార్పొరేషన్లుగా కులాలుగా విభజించి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా గాలికి వదిలేశారన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చేసి నవరత్నాలు పేరుతో వాడుకుంటూ బిసిలను మోసం చేస్తున్నారన్నారు. సబ్ ప్లాన్ నిధులు అన్ని కూడా దుర్వినియోగం చేసి ప్రజలను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును నిర్మించలేదని, కనీసం తాగు సాగు నీటి ప్రత్యామ్నాయ చర్యలు కూడా తీసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రజలు త్వరలో తగిన గుణపాఠం చెప్తారన్నారు. రాయలసీమ జోనల్ ఇంచార్జ్ మురళి మోహన్ నాయుడు, సీనియర్ నాయకులు కాలింగి నరసింహ వర్మ, నక్కలమిట్టా శ్రీనివాసులు, వాసుదేవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పార్థసారథి

సమతానగర్ సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : బోరింగ్ చెడిపోయి మురికి కాలువలు నిండిపోయి ప్రజల ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు కనిపించడం లేదని 19వ వార్డులో పర్యటించిన సిపిఎం ప్రతినిధి బృందం నగరపాలక సంస్థ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కాలనీలో ఎక్కువమంది రోజు పనులు చేసుకుంటూ జీవించేవారున్నారు. బోరింగ్ చెడిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలువల్లో మురుగు పేరుకుపోయిందని, దోమలు బెడదతో పాటు దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే బోరింగ్ రిపేర్ చేసి కాలువలో క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో సిపిఎం వార్డు కార్యదర్శి బి.రాధాకృష్ణ, సభ్యులు రత్నమ్మ, సీతమ్మ, రుద్రమ్మలతో పాటు కాలనీవాసులు పార్వతమ్మ, రేణుక, సుశీలమ్మ, డేవిడ్ పాల్గొన్నారు





జగన్ పాలనలో బిసిలకు అత్యున్నత స్థానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అట్టడుగున ఉన్న ఎన్నో బిసి కులాలకు ప్రభుత్వ, పార్టీ పదవులు కల్పించి వారికి గుర్తింపునిచ్చారని కర్నూలు బిసి సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ నాగరాజు యాదవ్ అన్నారు. కర్నూలు ఉమ్మడి జిల్లాల బిసి సెల్ సమావేశాన్ని ఆయన తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిసిలందరూ నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా గుర్తింపు పొందారన్నారు. రాబోయే కాలంలో బిసిలందరం ఒక్కటై ప్రతి ఒక్క బిసి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, నంద్యాల జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



'డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి' కి అటానమస్ గుర్తింపు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యుజిసి అనుబంధ సంస్థగా గుర్తించింది. కళాశాల చైర్మన్ డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు మరోమారు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్ విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ తమ కళాశాలకు అటానమస్‌గా గుర్తింపు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. ఆ కళాశాల సిబ్బంది బాణ సంచా సంబరాలు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కన్నా కుమార్ , టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు : వైసిపి

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలన పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బివై. రామయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం 19వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా శకుంతల కళామందిర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వార్డు నాయకులు భారీ గజమాలను క్రేన్ ద్వారా సత్కరించి స్వాగతం పలికారు. తర్వాత రాజేశ్వరినగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును అడిగి ప్రజా మద్దతు బుక్‌లో నమోదు చేశారు. అనంతరం వారి ఫోన్ ద్వారా 8296082960 నెంబర్‌కి మిస్డ్ కాల్ చేయించారు. ఇంటి యజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్ ను అతికించారు.బివై. రామయ్య మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయలేని సంక్షేమ పాలనను వైఎస్ కుటుంబం చేస్తుందని కొనియాడారు. 14 నేలల్లో రానున్న ఎన్నికల్లో 175 స్థానాలే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రచారం చేస్తున్నామన్నారు. వైఎస్. జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకే రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేయడం అతియేశక్తి కాదన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98శాతం అమలు చేశామన్నారు. 80శాతం ప్రజలు లక్షలాది రూపాయలు లబ్ది పొందారన్నారు. ఈ కార్యక్రమం 20వ తేదీ వరకు కొనసాగుతుందని, ప్రతి వార్డు, గ్రామానికి వెళ్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వైసిపి మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ గాజుల శ్వేత రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు వైజ అరుణ, సాన శ్రీనువాసులు, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంత్ రెడ్డి, జడ్‌పిటిసి సూర్యనారాయణ రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మి రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, జయరాముడు, మిద్దె చిట్టెమ్మ, చిన్న నరసింహులు, సాపూరు మాధురి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



రాక్షస పాలనకు చరమగీతం : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తుందని రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి చరమ గీతం పాడాలని తెలుగుదేశం పార్టీ పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు మండలం పందిపాడు గ్రామం బిఆర్ రెడ్డి కాలనీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు, పందిపాడు గ్రామ నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి శేఖర్ చౌదరి, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు, పూల శివ శంకర్, అంజి చౌదరి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకట స్వామి, నంద్యాల పార్లమెంటూ మహిళ అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్ జిల్లా కార్యదర్శి కేతూరు మదు, అర్బన్ నాయకులు ధనుంజయ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-ఆలూరు

కరోనా సమయంలో కర్నూలు బస్టాండ్‌లో తొలగించిన ఆర్‌టిసి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌టిసి స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ యూనియన్ నాయకులు దేవరాజు, మద్దిలేటితో కలిసి ఆలూరులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో కర్నూలు బస్టాండ్‌లో తొలగించిన కార్మికుల్లో కొంతమందిని తీసుకోగా మరో 11 మందిని తీసుకోలేదని తెలిపారు. అప్పటి నుంచి తొలగించిన కార్మికులను తీసుకోవాలని అడుగుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. ఉద్యోగంపైనే ఆధారపడిన స్వీపర్లను తొలగించడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బస్టాండ్ చాలా విశాలమైందని, అవసరమైన స్వీపర్లను తీసుకోవాలని కోరారు. తక్కువ మందితో ఎక్కువ పని చేయించడం వల్ల స్వీపర్లు పని భారానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మంత్రి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

'యువగళం'ను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు


న్యాయవాదులతో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

త్వరలో ఆదోని నియోజకవర్గంలో జరిగే యువగళం పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన లీగల్ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రముఖ పాత్ర పోషించిన లీగల్ సెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యువ నాయకులు లోకేష్ చేపడుతున్న యువ గళం పాదయాత్ర ఈనెల రెండో వారంలో కర్నూలు జిల్లాలో ప్రవేశిస్తుందని చెప్పారు. పాదయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాదయాత్రకు లీగల్‌గా ఎలాంటి సమస్య రాకుండా న్యాయవాదులు చూడాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందన్నారు. రాష్ట్ర ప్రజలు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వైపు చూస్తున్నారని తెలిపారు. టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వైఆర్.మల్లికార్జున, అధికార ప్రతినిధి ఎం.జనార్ధన్, యువగళం లీగల్ జట్టు నాయకులు మల్లికార్జున, రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకులు వీరన్న నాయుడు, ఆదోని లీగల్ సెల్ నాయకులు పి.రాజేంద్రప్రసాద్, అబ్దుల్ అన్సారి, తాయన్న, దేవరాజు, పద్మదేశాయి, ఉమా కుమార్, రామకృష్ణ, మాజీ ఎజిపి ఖాసీం వలీ, హనుమేష్, మస్తాన్ వలీ, నాగేంద్రయ్య పాల్గొన్నారు.

ఆర్‌డిటికి తిక్కారెడ్డి రూ.2.5 లక్షలు విరాళం

- రాజకీయాలకతీతంగా విరాళాలు ఇవ్వండి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి


విరాళం అందజేస్తున్న తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజకీయాలకు అతీతంగా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు విరాళాలు అందజేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఆయన స్వగృహంలో 'స్పందించు... సాయం అందించు' అనే కార్యక్రమం ద్వారా ఆర్‌డిటి సంస్థకు రూ.2.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు సహాయం చేయడంలో ఆర్‌డిటి సంస్థ చేసున్న సేవా కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని పేర్కొన్నారు. ఆర్‌డిటి సంస్థ ఆర్‌డి రామేశ్వరి, కోసిగి ఏరియా ఎటిఎల్ కృష్ణయ్య, సిఒలు నారాయణ, బసవరాజు తిక్కారెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆర్‌డిటి వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆర్‌డిటి సంస్థకు విరాళంగా ఇచ్చిన డబ్బును అనాథ పిల్లలకు ఉపయోగిస్తామని ఆర్‌డిటి సంస్థ సభ్యులు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, కోసిగి మండలం కన్వీనర్ జ్ఞానేష్, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, చిదానంద, కృష్ణ, నాగేష్, ఎరిగేరి వీరేష్, డేవిడ్, ఈరన్న పాల్గొన్నారు.

రూ.కోట్లలో వ్యయం... నెరవేరని లక్ష్యం...

- నత్తనడకన పనులు - నాణ్యతకు తిలోదకాలు - రెండేళ్లుగా సా...గుతున్న ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని చిన్నహరివాణం, సంతేకుడ్లూరు మధ్యలో రూ.6 కోట్ల వ్యయంతో నూతన ఎస్‌ఎస్ ట్యాంకు పనులు చేపట్టి రెండేళ్లవుతోంది. గతేడాదే పనులు పూర్తి చేసి పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, మదిరె గ్రామాలకు తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి భూమి పూజకు వచ్చిన సందర్భంగా హామీఇచ్చారు. గ్రామస్తులకు ఎదురుచూపు తప్పలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల రెండేళ్లుగా ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈఏడాది కూడా తాగునీరు అందదని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. వేసవి ప్రారంభమైంది. గ్రామాల్లో ఉన్న చిన్న ఎస్‌ఎస్ ట్యాంకుల్లో తాగునీరు పుష్కలంగా ఉంది. ఈనెల 10న ఎల్ఎల్‌సి నీరు నిలిపేస్తామని అధికారులు తెలిపారు. మరో 20 రోజులకు మాత్రమే తాగునీరు దొరుకుతుందని, మే, జూన్ నెలలో తాగునీటికి ఇబ్బంది తప్పదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా కొనసాగుతున్న ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణ లక్ష్యం నెరవేరడం లేదు.

నత్తనడకన పనులు

సుమారు రూ.6 కోట్లతో వ్యయంతో చేపడుతున్న ఎస్-ఎస్ ట్యాంకు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకున్న ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించడం లేదని పేర్కొంటున్నారు. ఒక ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణంలో నాణ్యత పాటిస్తే ఎన్నో ఏళ్లుగా గుర్తింపు ఉంటుందని, పనుల్లో నాణ్యత లోపిస్తే ఆ బాధ్యత ఎవరు తీసుకుంటారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నల్ల రేగడి భూములు కావడంతో చుట్టూ నాలుగు పక్కల నల్ల రేగడి వేసి, పైకి మాత్రం (గరుసు) వేయించి, చుట్టూ సిమెంట్ తక్కువగా వేసి పనులు చేపడుతున్నారని పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల చేసిందే పనులు, వేసిందే బిల్లులు అన్నట్లుగా పనులు సాగుతున్నాయని చర్చించుకుంటున్నారు. పనులు ఆలస్యం కావడంతో ఈ వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

రూ.కోట్ల వ్యయంతో చేపడుతున్న ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణ పనుల పర్యవేక్షణకు అధికారులు ఎందుకు రావడం లేదని, ఇంతకు క్వాలిటీ కంట్రోల్‌కు కూడా రాలేదని గ్రామస్తులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పనుల్లో నాణ్యత లోపిస్తోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పర్యవేక్షించాలని కోరుతున్నారు.

స్పందించని కాంట్రాక్టర్లు, అధికారులు

ఈ విషయాలపై కాంట్రాక్టర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. ఇటు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను సంప్రదించగా మండల స్థాయి అధికారి 'నేను సెలవులో ఉన్నాను' అంటూ ఫోన్‌ను మధ్యలో కట్ చేశారు.


కొనసాగుతున్న ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో విద్యుదాఘాతంతో నగర్ల చిన్న నాగప్ప (32) మృతి చెందారు. శుక్రవారం ఉదయం స్నానం చేసిన తర్వాత తడిసిన బట్టలను జి తీగలపై ఆర పెడుతుండగా తీగలో విద్యుత్ ప్రవహించడంతో మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇంటికి ముందు రేకుల షెడ్డు ఉన్నందున విద్యుత్ తీగ ఉందని, ఎక్కడో ఒక చోట జి తీగకు అర్త్ కావడంతో ఈ ప్రమాదం జరిగిందని బంధువులు తెలిపారు. మృతునికి భార్య నగర్ల లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎఇ గోవిందును వివరణ కోరగా రేకుల షెడ్డు కింద విద్యుత్ సరఫరా అవుతున్న సర్వీసు వయర్ ద్వారా జి తీగకు విద్యుత్ సరఫరా అయ్యి ఉంటుందని, సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించామని పేర్కొన్నారు.

జగనన్నే 'మా భవిష్యత్తు'

- మంత్రి గుమ్మనూరు జయరామ్
- జిల్లాలో 'జగనన్నే మా భవిష్యత్తు

ప్రజాశక్తి-ఆలూరు


ఆలూరులో పాల్గొన్న మంత్రి జయరామ్


ఎమ్మిగనూరులో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎర్రకోట

ఆలూరు పట్టణం కోయనగర్‌లో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మంత్రి గుమ్మనూరు జయరామ్ ప్రారంభించారు. ఈ నెల 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకుంటామన్నారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, ఎంపిపి రంగమ్మ, ఎంపిటిసి మోతి ఎల్లమ్మ, వైసిపి మండల కన్వీనర్ వీరేష్, శ్రీధర్, బాషా, హనుమయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు. **కర్నూలు** నగరంలోని 36వ వార్డు పెద్దపాడు గ్రామంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, పెద్దపాడు మాజీ సర్పంచి శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు 'మా నమ్మకం నువ్వే జగన్' నిర్వహించారు. గృహ సారథుల కన్వీనర్ లలిత, బీచుపల్లి, మద్దిలేటి, సుధాకర్‌రెడ్డి, పుల్లన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 3వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం'ను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. చేనేత కుటుంబాల ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం ఎలా ఉంది, ఏ విధంగా పరిపాలన సాగిస్తున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ బంగి శ్రీరామ్, వార్డు ఇన్‌ఛార్జీ వినయ్ కుమార్, కౌన్సిలర్ శివ ప్రసాద్, మన్సూర్ బాషా పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లోని చౌడేశ్వరి దేవి కాలనీలో వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' నిర్వహించారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి గ్రామ సర్పంచ్ రామాంజనేయులు మాజీ ఎంపీపీ రఘురాం గుడిసె శివన్న తదితర నాయకులు పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని నేమకల్లు గ్రామంలో సర్పంచి ప్రేమ్ కుమార్, సచివాలయ కన్వీనర్ గిరి, గృహ సారథి గురునాథ్ ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న'లో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారుల ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్‌ను అతికించారు. సర్పంచి ప్రేమ్ కుమార్, గృహ సారథులు గిరి, గురునాథ్, విద్యా కమిటీ ఛైర్మన్ అశోక్, వైసిపి సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, గురుదాసు, మాబు హుసేని, మోహన్, రాముడు పాల్గొన్నారు. **హాలహర్వి**లో 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్‌ను ప్రతి ఇంటికీ అతికించారు. మంత్రి గుమ్మనూరు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ భీమప్ప చౌదరి కార్యక్రమాన్ని చేపట్టారు. రాజశేఖర్, దర్గప్ప, ఎంపిటిసి భర్త రామకృష్ణ, చింతకుంట వెంకటేశులు, మెదహాళ్ సురేంద్ర పాల్గొన్నారు.


పెద్దకడబూరులో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి


చిప్పగిరిలో మాట్లాడుతున్న సర్పంచి, గృహ సారథులు


పెద్దపాడులో


ఆర్థిక సాయం అందిస్తున్న వాహబ్

మహిళలకు ప్రిన్స్ వహాబ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తీర్థయాత్రకు వచ్చి డబ్బు పోగొట్టుకొని దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇద్దరు తెలంగాణ మహిళలకు పట్టణానికి చెందిన ఎఆర్ స్పోర్ట్స్ యజమాని ప్రిన్స్ వహాబ్ శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. తెలంగాణ యాదగిరిగుట్టకు చెందిన ఇద్దరు మహిళలు మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి ప్రయాణం కొనసాగిస్తున్నారు. మార్గ మధ్యంలో గురువారం అర్ధరాత్రి ఎమ్మిగనూరు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద వారి పర్సును ఎవరో దొంగలించినట్లు తెలుసుకున్నారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. రోజు కూలికి వెళ్తే కానీ గడవని పరిస్థితి. వారి పరిస్థితిని గమనించిన పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఆవుల శ్రీనివాసులు ప్రిన్స్ వహాబ్‌ను సహాయం చేయమని కోరారు. తక్షణమే స్పందించి ఇద్దరు మహిళలకు హైదరాబాద్ మీదుగా యాదగిరిగుట్టకు వెళ్లేందుకు రెండు ఆర్‌టిసి బస్ టికెట్లు కొనుగోలు చేసి, కొంత నగదును వారి చేతికి అందించారు. ఆ ఇద్దరు మహిళలు పాత్రికేయునికి, ప్రిన్స్ వహాబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌టిసి బస్టాండ్ ఇన్‌ఛార్జీ ఎల్లప్ప, సిబ్బంది ప్రిన్స్ వహాబ్ ను అభినందించారు.

సయ్యద్ సాతూబీ దర్గా ముతవల్లిగా సయ్యద్ మహబూబ్ బాష

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ శివారులోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని సయ్యద్ సాతుబీ దర్గాకు ముతవల్లిగా సయ్యద్ మహబూబ్ బాషా హుస్సేనిని నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం ఆయన మాట్లాడారు. 259ఎలో 3.97 సెంట్లు, 259బిలో 0.2 సెంట్లు, 259సిలో 0.7 సెంట్ల విస్తీర్ణంలో దర్గా ఉందన్నారు. ఈ దర్గాకు మొత్తం 4.6 సెంట్ల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు. ఈ భూముల్లో ఎవరూ ఎలాంటి లావాదేవీలు జరపకుండా వక్ఫ్ బోర్డు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

ఎన్నాళ్లీ.. దుస్థితి...

ప్రజాశక్తి - ఆదోని

చినుకు పడితే చాలు కోర్టు ఆవరణమంతా బురద, చిత్తడిగా మారి పాదం తీసి వేయలేని పరిస్థితి. ఈ దుస్థితి ఎన్నాళ్లు అంటూ న్యాయవాదులు ప్రభుత్వ అధికారులపై చీదరించుకుంటున్నారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆర్‌డిఒ కార్యాలయం, సబ్ జైలు ప్రాంతం నుంచి సబ్ కోర్టు ఆవరణలో నీరు నిలిచింది. వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు అటువైపు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురైంది.

కనీసం గ్రావెలైనా వేయించాలి

సబ్ కోర్టు ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా గుంతలు పూడ్చాలని గతంలోనే మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని న్యాయవాదులు తెలిపారు. అప్పట్లో స్పందించిన మున్సిపల్ అధికారులు పరిసరాలను పరిశీలించి గ్రావెల్ వేయిస్తామని హామీ ఇచ్చారని కూడా గుర్తు చేశారు. తొలకరి వర్షాలు మొదట్లోనే పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉంటుందో గమనించాలని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుంతలు పూడ్చి గ్రావెల్ వేయాలని కోరుతున్నారు.


అపరిశుభ్రంగా మారిన మున్సిపల్ మైదానం

మున్సిపల్ మైదానం అంతే

పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ మైదానం పరిస్థితి అధ్వానంగా మారింది. మైదానం చదును కోసం రూ.20 లక్షలు ఖర్చు చేసినా చిన్నపాటి వర్షం వస్తే అందులో నీరు నిలిచి విద్యార్థుల క్రీడలకు ఆటంకంగా మారుతోంది. మైదానం చదునుపై శ్రద్ధ చూపిన అధికారులు డ్రెయినేజీ మరచిపోవడం వల్ల వర్షపు నీరు మైదానంలో ఎక్కువ రోజులు నిలుస్తున్నాయని చెబుతున్నారు. మైదానంలో నీరు నిలవకుండా మున్సిపల్ అధికారులు కాల్వ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘం నాయకులు కోరుతున్నారు.

విరుపాపురంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని విరుపాపురం గ్రామంలో ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్, జయశాలి ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జెబిఆర్‌సి క్రీస్తుసంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా సర్పంచి ప్రహ్లాద యాదవ్, మాజీ జడ్‌పిటిసి ఆనంద్, సంఘం పెద్దలు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విరుపాపురం సర్పంచి ప్రహ్లాద యాదవ్ మాట్లాడారు. గత నాలుగేళ్లుగా ఎఐటిసిసి, జెబిఆర్‌సి క్రీస్తుసంఘం ఆధ్వర్యంలో గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఆదోని నుంచి పత్తికొండకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన పత్తికొండకు వెళ్లే వాహనదారులు దాహం తీర్చుకుంటున్నారని చెప్పారు. చలివేంద్రం దగ్గర నీటిని వృథా చేయకూడదని, వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కువ శాతం తాగునీటిని తీసుకోవాలని సూచించారు. జిల్లా జాయింట్ సెక్రటరీ రాజేష్, ఎంపిటిసి శివకుమార్, ప్రసాద్, క్రీస్తు రాజు సంజీవ్, జ్యోతి, ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

గోనెగండ్లలో చలివేంద్రం ప్రారంభం

గోనెగండ్ల : గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాంగణంలో మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం సర్పంచి హైమావతి, ఉప సర్పంచి రాంపురం ఖాసీం, మాజీ సర్పంచి రహంతుల్లా, టిడిపి సీనియర్ నాయకులు ప్రభాకర్ నాయుడు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవిలో ఎండల తీవ్రత పెరిగిందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం గోనెగండ్లకు రాకపోకలు సాగించే ప్రజల సౌకర్యార్థం పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టిడిపి నాయకులు బేతాళ బడేసాహెబ్, కృష్ణమ నాయుడు, ఎన్‌వి.రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, అడ్వకేట్ చంద్రశేఖర్, రమేష్ నాయుడు, దరగల మాబు, మదీన, మిన్నెల్లా, పంచాయతీ సిబ్బంది సుభాన్, అనిల్ మలాంగ్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శుక్రవారం గుడ్ ఫ్రైడే నుంచి వరుసగా సెలవులు రావడంతో మంత్రాలయంలో భక్తుల సందడి నెలకొంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకున్న భక్తులు పవిత్ర తుంగభద్ర నదిలో స్నానాలు చేశారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. భక్తులకు దర్శన సమయంలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు సిబ్బంది ద్వారా చర్యలు చేపట్టారు. దర్శన అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. శ్రీమఠం ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీమఠం నిర్వహణలో ఉన్న వసతి గృహాలను దాతలకు, విఐపిలకు కేటాయించడంతో సామాన్య భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రయివేట్ లాడ్జీలను ఆశ్రయించక తప్పకపోవడంతో ధరలకు రెక్కలు వచ్చి భక్తుల జేబులకు చిల్లులు పడ్డాయి. అధిక ధరలు చెల్లించలేక 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎమ్మిగనూరులోని ప్రయివేట్ లాడ్జీలను ఆశ్రయిస్తున్నట్లు భక్తులు వాపోయారు.


ఆలయంలో ఉన్న భక్తులు


శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఎస్‌కెడి కాలనీ హోలీట్రినీ చర్చిలో రెవరెండ్ పాస్టర్ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో సాయంత్రం వరకు క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను స్మరించుకున్నారు. కలవరి కొండ పాస్టర్ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో కొండపై ఉపవాస ప్రార్థనలు జరిగాయి. కథోలిక చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండిగిరి బాల ఏసు చర్చి విచారణ గురువు కోల విజయ రాజు శిలువను భుజాన మోశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్వమానవాళి పాపహరణ కోసం క్రీస్తు శిలువలో మృతి చెందాడని అన్నారు. అలాగే అన్ని సంఘాల చర్చీలలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి.

బాధితులకు ప్రదీప్ రెడ్డి పరామర్శ

- తక్షణ సాయం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

భూమి గట్టు తగాదాల కారణంగా జరిగిన దాడిలో గాయపడిన బాధితులను వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి పరామర్శించారు. గత నెల 30న జరిగిన దాడిలో గాయపడిన మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఈడిగ చిన్న ఈరప్ప, నరసింహులు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ప్రదీప్ రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి, తక్షణ సహాయం కింద రూ.15 వేల నగదును అందజేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు రోగప్ప, రవి రెడ్డి, రాము, హనుమంతప్ప, ఉరుకుందు, నరసింహులు, మల్లికార్జున ఉన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న ప్రదీప్‌రెడ్డి



కొత్తగా ఏమీ లేదు..!

- ఫ్యామిలీ డాక్టర్‌లో 104 సేవలే..
- జిల్లాలో 26 ప్రాంతాల్లో ప్రారంభం..



ఆత్మకూరు మండలంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం కింద 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

"ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చాం..ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతాయి.." ఇదీ అధికారపక్ష నాయకులు ఊదరగొడుతోంది. కానీ ఆ విధానంలో కొత్తగా ఏమీ లేదు. గతంలో 104 ద్వారా అందుతున్న సేవలే ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందుతాయి. జిల్లాలో 26 ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభించారు..

ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చామని అధికార పార్టీ నాయకులు, అధికారులు చెబుతున్నారు. ఈ విధానం ద్వారా 104 వాహనం ద్వారా వైద్యుడు, వైద్య సిబ్బంది రోజుకో గ్రామానికి వెళ్లి వైద్య సేవలను అందిస్తారు. వైద్యులను పరీక్షించి మందులను అందిస్తారు. పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు వైద్యులను నియమించి ఒకరు పిహెచ్‌సిలో, మరొకరు ఈ 104 వాహనంలో గ్రామాలకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 26 ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం కొత్తగా తీసుకొచ్చిందేమీ కాదు. గతంలో నుంచే అమలవుతోంది. 104 పేరుతో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించేవారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో అదే విధంగా వైద్య సేవలను అందిస్తున్నారు. నూతన విధానం కోసం 26 మంది వైద్యులను కొత్తగా నియమించారు. ఈ విధానం కోసం కొత్తగా వైద్య సిబ్బందిని ఎవరినీ నియమించలేదు. గతంలో 104 వాహనంలో పని చేస్తున్న డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సేవలను యథావిధంగా ఉపయోగించుకుంటున్నారు. గతంలో 104 ద్వారా అందుతున్న సేవలకే పేరు మార్చి ప్రచార ఆర్భాటం ప్రదర్శించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్ అంటే..

ఫ్యామిలీ డాక్టర్ అంటే కుటుంబ వైద్యుడు అని అర్థం. ఒక కుటుంబానికి ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆ వైద్యుడిని సంప్రదించాలి. ఆ వైద్యుడు వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఆ ఊరిలోనే నివాసం ఉండాలి. ఒక వేళ ఊరిలో లేకపోయినా ఫోన్ ద్వారా అయినా అందుబాటులో ఉండాలి. అవసరమైన వైద్య సలహాలు అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యుడు గ్రామంలో అందుబాటులో ఉండరు. వాహనంలో వచ్చి వైద్య సేవలు అందించి వెళ్లిపోతారు.

గ్రామాల్లో వైద్య సేవలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు గ్రామాల్లో వైద్య సేవలను అందిస్తారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు వైద్యులు ఉంటారు. ఒకరు పిహెచ్‌సిలో ఒపి చూస్తారు. మరొకరు 104 వాహనంలో వెళ్లి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తారు. గ్రామంలో ఎవరైనా రాలేని పరిస్థితిలో ఉంటే వారి ఇంటికే వెళ్లి వైద్య సేవలను అందిస్తారు.

- వెంకటరమణ, డిఎంహెచ్‌ఒ.



సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

లారీ యజమానుల సమస్యలపై దృష్టి

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణంలోని వైసిపి కార్యాలయంలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సెవెన్ హిల్స్ నాగరాజు బృందం మంత్రి బుగ్గనను కలిశారు. ఈ సందర్భంగా లారీ యజమానుల బృందం మంత్రితో మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణంలో బండ్లమెట్ట రుసుము వసూళ్లను లారీ యజమానులకు మినహాయించాలని కోరారు. మండలంలో లారీ యజమానులు వారి వారి లారీలను నిలుపుకొనుటకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సాధ్యమైనంత త్వరలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వైసిపి ముస్లిం ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు ముర్తుజావలి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

గోరుమానుకొండ సమీపంలో అభివృద్ధి పనుల పరిశీలన

బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. సమీపంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల ఐటిఐ ఎస్ఎంఎస్ఈ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బేతంచర్ల మండలంలో పాలిటెక్నిక్ కాలేజీ నిర్మాణం కోసం స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బేతంచెర్ల కొత్త బస్టాండ్ విస్తరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బేతంచర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి చంద్రారెడ్డి, ఆర్అండ్‌బి అధికారులు, తహాశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచి కోడే వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఖాజా హుస్సేన్, గూని నాగరాజు, రామనాయుడు, తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టన్నెల్ వివరాలు తెలుసుకుంటున్న అడిషినల్ డిజిపి

ప్రజాశక్తి - అవుకు

గాలేరు నగరి సుజల స్రవంతి వరద కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా అవుకు మండలంలో నిర్మిస్తున్న రెండు సమాంతర సొరంగాలను రాష్ట్ర అదనపు డిజిపి మాదిరెడ్డి ప్రతాప్ శుక్రవారం సందర్శించారు. అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, కొలిమిగుండ్ల ఎస్సై రమేష్ రెడ్డిలతో కలిసి ఆయన టన్నెల్‌లో జరుగుతున్న పనుల వివరాలను అక్కడి ఎస్ఆర్‌బిసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మిస్తున్న మూడవ టన్నెల్ వివరాలను కూడా తెలుసుకొని అక్కడి నుండి అవుకు జలాశయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అవుకు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రంజాన్ వేళలు
శనివారం
ఇఫ్తార్ : 6 : 37
ఆదివారం
సహెరి : 4 : 44

ఐఎంఎ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఐఎంఏ ఆధ్వర్యంలో నంద్యాలలో ప్రజా అవగాహన నడక ర్యాలీ నిర్వహించారు. స్థానిక మధుమణి నర్సింగ్ హోమ్ నుండి ప్రారంభమైన వైద్యుల నడక ర్యాలీని రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి అనిల్, వైద్యులు పాల్గొని మాట్లాడారు. ర్యాలీలో రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు సహదేవుడు, మధుసూదనరావు, ఐఎంఏ మహిళా విభాగం నాయకులు డాక్టర్ నాగమణి, వైద్యులు నర్మదా, అరుణకుమారి, మాధవి, వసుధ, లక్ష్మీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

అటవీశాఖ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నంద్యాల ఐఎంఎ, జిల్లా అటవీ శాఖ సంయుక్త నిర్వహణలో అటవీ శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులకు మల్టీ స్పెషాలిటీ శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులుగా జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినీత్ కుమార్ మాట్లాడుతూ జబ్బుల వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కన్నా ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెడికల్ చెకప్ చేయించుకోవడం అవసరమన్నారు. తద్వార కొన్ని రోగాలు సరైన సమయంలో గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఐఎంఎ సమర్పణ దివస్‌గా నిర్వహిస్తున్నా మని తెలిపారు. శిబిరంలో ఐఎంఎ నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ అనిల్, వైద్యులు ఉద్యోగులకు షుగర్, ఇసిజి, గుండె 2 డి ఎకో స్కానింగ్ పరీక్షలు చేశారు. అవరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా చైర్మన్ శ్రీకాంత్ మందుల పంపిణీ పర్యవేక్షణ చేశారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ



మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

శిరివెళ్లలో అభివృద్ధి శూన్యం

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - శిరివెళ్ళ

శిరివెళ్ల మండల కేంద్రంలో అధికార పార్టీ నేతలు చేసిందేమీ లేదని, అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. శుక్రవారం శిరివెళ్లలోని 15, 16వ వార్డులలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని టిడిపి మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిరివెళ్లలో డ్రెయినేజీ, పారిశుధ్య పనులు చేయలేని గత్యంతర స్థితిలో అధికార పార్టీ నాయకులు ఉన్నారని, ప్రజలు ఎదురుగా వచ్చి సమస్యలు వివరిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించలేని అధికార పార్టీ నాయకులకు పదవులు ఎందుకని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే సమయం తొందర్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు యామా గుర్రప్ప, మోహన్ రెడ్డి, కోటపాడు మాజీ సర్పంచి కాల్లూరి శకుంతలమ్మ, గేట్ షేక్షా, షేక్ మునాఫ్, లింగమయ్య నంద్యాల అబూబకర్ సిద్ధిక్ బి, ఎండి రఫీ, బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడప' కార్యక్రమం

- విజయవంతం చేయండి : అంబటి గురువిరెడ్డి

ప్రజాశక్తి కొలిమిగుండ్ల

మండలంలోని ఇటిక్యాల గ్రామంలో నేడు చేపట్టే గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కావున మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి రెడ్డి

గుండె జబ్బులపై అవగాహన అవసరం

- ప్రముఖ కార్డియలజిస్ట్ డాక్టర్ క్రాంతి చైతన్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేటి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని ఇండస్ గుండె ఆస్పత్రి ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ క్రాంతి చైతన్య తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ఆయనను కలిసిన ప్రజాశక్తితో గుండె జబ్బులపై మాట్లాడారు. ఆయన మాటల్లోనే... 'నేటి ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి మానసికంగా, శారీరకంగా, సామాజికంగా ఆరోగ్యవంతంగా ఉండటం లేదు. రోజు ఏదో ఒక ఒత్తిడికి లోనవుతూనే ఉంటున్నాడు. నిత్యం మానసిక ఒత్తిడికి లోనై అనేక రోగాల బారినపడుతున్నారు. అందులో గుండె జబ్బులు ప్రధానమైంది. గుండె జబ్బులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. చిన్న, పెద్ద అనే వయసు తేడా లేకుండా గుండె జబ్బుల బారిన పాడుతున్నారు. చిన్న వయస్సు వారిలో 90 శాతం పైన స్మోకింగ్ అలవాటు ఉన్న వారికి, మరి కొంతమందిలో ఆహారపు అలవాట్ల వలన, బిపి షుగర్, ఊబకాయం వంటి సమస్యల వలన గుండె జబ్బులు వస్తున్నాయి. ఇటీవల జరిగిన మరణాలు ఈ కోవకు చెందినవేనని నా అభిప్రాయం. కోవిడ్ వ్యాక్సిన్ వలనే గుండె జబ్బులు వస్తున్నాయనడానికి ఆధారాలు లేవు. సైంటిఫిక్‌గా రీసెర్చ్ చేయకుండా చెప్పలేం. ఆరోగ్యంగా ఉన్న వాళ్లలో కూడా గుండె జబ్బులు సడన్‌గా వస్తున్నాయి. సడన్ కార్డియక్ డెత్‌లు జరుగుతున్నాయి. గుండె రక్త కణాలలో పొరల కింద కొవ్వు పేరుకపోవడం వలన సడన్‌గా బ్లాక్ అయి రక్త సరఫరా ఆగి గుండె పోటు వస్తుంది. సాధారణంగా 60 నుండి 100 వరకు కొట్టుకోవాల్సిన గుండె పోటు వచ్చినప్పుడు సడన్‌గా 300 వరకు కొట్టుకోవడం వలన మరణం సంభవిస్తుందన్నారు. అయితే షాక్ ఇవ్వడం ద్వారా గుండె లయను గతిలో పెట్టవచ్చు. గుండె పోటుకు గురైన వ్యక్తి సరైన సమయంలో ఆసుపత్రికి రావడం వలన 90 శాతం మరణాన్ని ఆపవచ్చు. గ్యాస్ నొప్పే కదా అని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఈసిజి పరీక్ష చేయించుకుంటే గుండె నొప్పినా.. లేక ఇతర నొప్పినా అనేది తెలిసిపోతుంది. గుండెకు రక్త సరఫరా ఆగిపోయిన కణాలు 6 గంటల వరకు బతికి ఉంటాయి. సమయం గడిచే కొద్దీ కణాలు చనిపోయి గుండె బలహీన పడుతుంది. ఆ సమయంలోపు వైద్యులను సంప్రదిస్తే మనిషి బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆలస్యం చేసే ప్రతి గంట ఖరీదు పది సంవత్సరాల ఆయుష్షు కావచ్చని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలి' అని డాక్టర్ క్రాంతి చైతన్య తెలిపారు.



మాట్లాడుతున్న ప్రముఖ కార్డియలజిస్ట్ డాక్టర్ క్రాంతి చైతన్య



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం సమీపంలో రూ.2 కోట్ల వ్యయంతో 33 /11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల జిల్లాగా ఏర్పడిన తర్వాత పట్టణంలో జనాభా రోజురోజుకు పెరిగిపోతుందని, విద్యుత్ వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సమస్యలు తలెత్తకుండా సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముస్లిం సోదరులకు టిడిపి రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందరెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, మాజీమంత్రి, ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర మాజీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, మాజీ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అహ్మద్ హుసేన్, టిడిపి నాయకులు తులసిరెడ్డి, మనియార్ ఖలీల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.




ఇఫ్తార్ విందులో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

నాలుగు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలో 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని మాజీ మంత్రి, నంద్యాల జిల్లా అబ్జర్వర్, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డిలు ప్రారంభించారు. పట్టణంలోని ముత్తు మియ్యా స్ట్రీట్‌లో జిల్లా అబ్జర్వర్, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌లు ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి, ప్రభుత్వ పని తీరు ఎలా వుంది, వాలంటరీ వ్యవస్థ ద్వారా ఎలా పథకాలు అందుతున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు జగనన్న సంక్షేమ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల పాలన బాగుందని, ప్రజలు మళ్లీ సిఎంగా జగన్మోహన్ రెడ్డి రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కన్వీనర్లదే : మాజీ మంత్రి

ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుండి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించవలసిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ముఖ్య కార్యకర్తలపై ఉందని మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రోజుల పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, సిఎం పాలన ఎలా ఉందో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపి ఇరిగేషన్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కర్రా గిరిజారెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, పోచ శీలా రెడ్డి, కొలిమిగుండ్ల మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి, నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అత్తార్ జాహీద్ హుస్సేన్, బండి బ్రహ్మానంద రెడ్డి, ఎల్వి సుధాకర్ రెడ్డి, పసుపల జనార్దన్ రెడ్డి, సయ్యద్ సజ్జాత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు


పాములపాడు : జెరూసలేం చర్చి లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు


బేతంచర్ల : సిలువను మోస్తూ ఊరేగింపు

ప్రజాశక్తి - ఆత్మకూర్
ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. **చాగలమర్రి:** నంద్యాల డయాసిస్ సిఎస్ఐ చర్చిలలో వేడుకలను నిర్వహించారు. **బండి ఆత్మకూర్:** మండలంలో గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. సిఎస్ఐ ఆర్‌సిఎం. ఏసన్న, మినిస్ట్రీస్ బైబిల్ మిషన్ చర్చిలలో ప్రార్థనలు చేశారు. **పాములపాడు :** మండలంలోని సిఎస్ఐ, ఆర్‌సిఎం, జెరూషలేం, బేతానయ క్రిస్టియన్ బ్రదర్స్ అసెంబ్లీ చర్చిలలో క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు నిర్వహించుకున్నారు. **బేతంచర్ల :** బేతంచెర్ల పట్టణం, గ్రామాలలో గుడ్ ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు. రోమన్ క్యాథలిక్ చర్చి ఫాదర్స్ కిరణ్, జోసెఫ్ ఆధ్వర్యంలో సిలువను మోస్తూ ఊరేగింపు నిర్వహించారు. **పగిడ్యాల :** మండలంలో ఆయా గ్రామాలలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. **కొత్తపల్లి :** మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు జరుపుకున్నారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. **సంజామల :** మండలంలోని అన్ని గ్రామాలలోని చర్చిలలో గుడ్ ఫ్రైడే పండుగను ఘనంగా జరుపుకున్నారు. **గోస్పాడు :** మండలంలోని అన్ని గ్రామాలలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే నిర్వహించుకున్నారు. గోస్పాడులోని ఆర్‌సిఎం చర్చి ఫాదర్ మధుసూదన్ రెడ్డి, ఫాదర్ బాలస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని ఆయా గ్రామాల్లో గుడ్ ఫ్రైడే పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు.


చాగలమర్రి: ప్రసంగిస్తున్న పాస్టర్


కుందూ నదిలో దాహం తీర్చుకుంటున్న మూగజీవాలు

భానుడి ప్రతాపం
తల్లడిల్లుతున్న మూగజీవాలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు
భానుడి ప్రతాపంకు ప్రజలతో పాటు మూగ జీవాలు తల్లడిల్లుతున్నాయి. శుక్రవారం మేత కోసం వచ్చిన గొర్రెల మందలు సూర్య ప్రతాపాన్ని తట్టుకోలేక కుందున్నదిలో దాహం తీర్చుకొని నదిలోనే సేద తీరాయి. మండలంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఎండ తీవ్రతనుండి నుండి ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలని ఉదయం 9 గంటల నుండి 12 గంటల లోపలనే తమ పనులు ముగించుకొని ఇళ్లకు చేరాలని, వేసవి తాపం తీరేందుకు చల్లని మజ్జిగ శీతల పానీయాలు సేవించాలని ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.



ఉపాధి హామీ కూలీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, తదితరులు

'ఉపాధి' కూలీలకు బీమా కల్పించాలి : వ్యకాసం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్
జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు జీవిత బీమా కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్ ఆధ్వర్యంలో ఏకోడూరు గ్రామంలో కూలీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వెళ్లే కార్మికులకు ఎండ తీవ్రతంగా ఉండడంతో వడదెబ్బ కొట్టడం, పనిచేసే చోట పాము కాటు గురయ్యే అవకాశం ఉందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే కార్మికులకు ఆటో ప్రమాదాలు, తదితర సంఘటన చోటు చేసుకోవడం జరుగుతుందని ప్రమాదం జరిగినప్పుడు వారికి జీవిత బీమా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. వెంటనే ఉపాధి హామీ కూలీలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేటీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు

సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - బేతంచెర్ల
ప్రస్తుత సమాజంలో యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఇతరులకు ఆదర్శం కావాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షమీల, గోరుమను కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గోరమానుకొండ గ్రామ సమీపంలో గల మోడల్ హైస్కూల్ వద్ద లెజెండ్ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులు, బాటసారుల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని ప్రిన్సిపల్ షమీల, సర్పంచ్ వెంకటేశ్వర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు, బాటసారులను దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో లెజెండ్ యూత్ సభ్యులు, విద్యార్థులు మోడల్ స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి
చాగలమర్రి పట్టణంలోని రచ్చబండ యూత్ సభ్యులు ఆవుల నరసింహ పతాప్ అధ్వర్యంలో పావన నరసింహస్వామి క్షేత్రానికి వెళ్ళే భక్తులు, ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. స్థానిక బసవన్నకట్ట సమీపంలోని రామాలయం వద్ద భక్తులు, ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రచ్చబండ యువకులు రాఘవ, నవీన్, ప్రవీణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

'నాడు - నేడు' పట్ల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ప్యాపిలి
మండలంలోని మమిల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న హెచ్ఎం శ్రీనివాసులు బదిలీల్లో భాగంగా ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలకు 27న బదిలీ అయ్యాడు. నాడు-నేడు పనులకు సంబంధించిన చార్జ్ ఇవ్వలేదు. దీంతో అప్పటి నుంచి పాఠశాలలో నాడు-నేడు పనులు ఆగి పోయాయి. ఈ విషయాన్ని గ్రామస్థులు ఎంఈఓ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేయగా నాడు-నేడు ఛార్జ్ వెంటనే ప్రస్తుత హెచ్ఎంకు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అయినప్పటికీ శ్రీనివాసులు ఛార్జ్ ఇవ్వలేదు. నాడు-నేడు ఛార్జ్‌తో పాటు పాఠశాలకు చెందిన మరికొన్ని రికార్డులు కూడా ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారులు స్పందించి నాడు- నేడు పనుల ఛార్జ్ ఇవ్వని హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓను వివరణ కోరగా ఛార్జ్ ఇవ్వాలని శ్రీనివాసులుకు చెప్పినా నిర్లక్ష్యం వహిస్తున్నాడని తెలిపారు.


నాడు నేడు పనులు నిలిచిపోయిన దృశ్యం

యువగళంలో పెద్ద ఎత్తున యువత

- త్వరలో జిల్లాలో మినీ యువగళం
- టిడిపి యువ నేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్
యువగళం పేరుతో నారాలోకేష్ చేపట్టిన పాదయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొంటుందని, యువతలో వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని టిడిపి యువ నేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాలలోని భూమా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లాలో యువగళం జరుగు సమయంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాల్సిన బాధ్యతను నారా లోకేష్ తనపై ఉంచారన్నారు. అందులో భాగంగా నంద్యాల పట్టణం నుంచి మినీ యువగళంను ప్రారంభిస్తామని, యువతను ఏకతాటిపై తీసుకొస్తామని పేర్కొన్నారు. శిల్పా వాళ్లు టిడిపిలోకి రావాలంటే ముందుగా శిల్పా మోహన్ రెడ్డి, రవి చంద్రలు చంద్రబాబు, నారా లోకేష్‌ల కాళ్లు పట్టుకోవాలని, అప్పుడే తాము పార్టీలోకి స్వీకరిస్తామని అన్నారు. ఈ మధ్య నంద్యాల కేంద్రంగా కార్యక్రమాలు చేస్తున్నారు.. ఇక్కడి నుండి పోటీ చేస్తున్నారా అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధికి తన తండ్రి భూమా నాగిరెడ్డి విశేష కృషి చేశారని, తప్పక తాము ఫోకస్ నంద్యాలపైనే ఉంటుందన్నారు. పార్టీ అధిష్టానం నంద్యాల సీటు ఎవరికిచ్చినా అందరం కలిసి పని చేస్తామని తెలిపారు.

14 రోజుల పాటు 'జగనన్నే మా భవిష్యత్' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్
ఈ నెల 7వ తేది నుండి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు ఇంటింటికి 'జగన్నన్నే మా భవిష్యత్-మా నమ్మకం' కార్యక్రమాన్ని గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి చేపడతామని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 రోజులపాటు ప్రతి ఒక్క కుటుంబాన్ని కలుసుకొని ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తామన్నారు. 20వ తేదీ ప్రజా సర్వే ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఈ ఫలితాలే ప్రభుత్వం పనితీరుకు కొలబద్ద అన్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారిని 82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరుతామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి



పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీ రును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వైసిపి ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడుగా సయ్యద్ మీర్

ప్రజాశక్తి - ఆత్మకూర్
ఆత్మకూర్ పట్టణ వైసిపి అధ్యక్షుడిగా సయ్యద్ మీర్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం ప్రకటించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సయ్యద్ మీర్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతా రని తెలిపారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నూతన అధ్యక్షుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సయ్యద్ మీర్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులను కార్యకర్తలను కలుపుకొని పోతూ పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, సుల్తాన్, మారుబోతుల విజయ్ గౌస్, రాజం, యూనిస్ పాణ్యం, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

బిసి సెల్ ఇన్చార్జిగా సల్లా నాగరాజు

ప్రజాశక్తి - చాగలమర్రి
నంద్యాల అసెంబ్లీ బీసీ సెల్ ఇన్చార్జిగా చాగలమర్రికి చెందిన సల్లా నాగరాజును నియమిస్తూ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సల్లా నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సల్లా తన నివాసంలో మాట్లాడుతూ జిల్లాలో టిడిపి బలోపేతానికి, నంద్యాల పార్లమెంటు పరిధిలో బీసీ సెల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డికి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియకి ధన్యవాదాలు తెలిపారు.



ప్రచారం కోసమే లోకేష్ పాదయాత్ర

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ


కొలిమిగుండ్ల : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమ దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ
టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కేవలం ప్రచారం కోసమే యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల నాని ఎద్దేవా చేశారు. శుక్రవారం పట్టణంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, పార్టీ పరిశీలకులు నరసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందుగా ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా సమస్యలు ఏమైనా ఉన్నాయా అన్న వాటిపై ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ తెలుసుకోవ డానికి రాష్ట్రవ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకొని అక్కడ అమలు చేస్తున్నారన్నారు. పరిశీలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, నారా లోకేష్‌లు అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావడానికి చూస్తున్నారని ప్రజలు నమ్మవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ గొట్లు సుధాకర్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల:** మండలంలోని చింతలయపల్లె గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం-ప్రస్తుత ప్రభుత్వం తేడాను, వైసిపి ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కొలిమిగుండ్లలో నాయకులు పేరం సూర్యనారాయణ రెడ్డి, వెంకటసుబ్బయ్య నాయుడు, నందిపాడు గ్రామంలో సర్పంచి గురువిరెడ్డి రెడ్డి, అంబటి చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జయ రామ కృష్ణ యాదవ్, సర్పంచి లక్ష్మీనారాయణ యాదవ్, గృహ సారథులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

- స్టార్ట్ అప్ ఫౌండర్ ప్రొఫెసర్ ఎన్.సాయి కృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల
విద్యార్థులు చురుగ్గా, వినూత్నంగా ఆలోచించాలని స్టార్ట్ - అప్ ఫౌండర్ ప్రొఫెసర్ ఎన్.సాయి కృష్ణ పేర్కొన్నారు. శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో శ్రీరామబుష్ణ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఉదయం ప్రారంభ సెషన్ తర్వాత ఎన్.సాయి కృష్ణ మాట్లాడారు. మనం పూర్తిగా అలసి పోయినప్పుడు నిష్క్రమించకుండా చిన్న బ్రేక్ తీసుకోవాలని, మనపై మనకు నమ్మకం కూడా ఉండాలని చెప్పారు. తదుపరి సెషన్‌లో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎస్‌కెయు అనంతపురం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగభూషణ్ రాజు మాట్లాడారు. ఉద్యోగాలు, ఉద్యోగార్థుల గురించి స్పష్టంగా వివరించారు. లక్ష్యాలను కలిగి ఉన్న, లేని విద్యార్థుల మధ్య తేడాను చెప్పాడు. అలాగే విద్యార్థులు కథలు చెప్పడం ప్రాక్టీస్ చేయాలని ఆయన కోరారు. మనం ఒక ఆలోచన కలిగి ఉండాలని, అలాగే అభ్యాసం మరింత జ్ఞానాన్ని ఇస్తుందని తెలిపారు. ప్యానల్ డిస్కషన్‌లో ప్రశ్నలు అడగాలని విద్యార్థులకు సూచించారు. ఒడిశాలోని నలందా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫౌండేషన్‌కి చెందిన చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అటల్ ఇంక్యుబేషన్ దుర్గా ప్రసాద్ గౌడ మాట్లాడారు. విద్యార్థులు స్టార్ట్ అప్ ఫౌండర్‌లుగా ఎలా రూపాంతరం చెందాలనే దానిపై దష్టి సారించాలని, పరిశ్రమలు 4.0 గురించి కూడా వివరించారు. నైపుణ్యం, డిజిటల్ అక్షరాస్యత, వ్యాపార నిర్వహణ ఆధునిక ఆర్థిక వ్యవస్థను ఎలా ఉపయోగిస్తుందనే దానిపై వివరించారు. తదుపరి విద్యార్థులకు వారి అనుమానాలు, అడ్డంకులను పానెల్ డిస్కషన్ ద్వారా నివృత్తి చేశారు. ఈ సెషన్ అనేది ఎఐసి-ఎస్‌కెయు ద్వారా హోస్ట్ చేయబడిన ప్యానెల్ చర్చ, ప్యానెల్ సభ్యులుగా షాహీన్, సాయి కృష్ణ, ప్రొ.కె.నాగభూష్ణ రాజు, ఏఐసీ-ఎస్‌కెయు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, దుర్గా ప్రసాద్ గౌడ్ - కో ఏఐసీ, కాలేజ్ డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి వ్యవహరించారు. ప్యానెల్ చర్చలలో సంప్రదాయ వ్యాపారాలు, ఆధునిక వ్యాపారం మధ్య గల వ్యత్యాసాలపై ఎక్కువగా శ్రద్ధ వహించారు. విద్యార్థులు ప్యానెల్ సభ్యులకు అనేక రకాల ప్రశ్నలు అడిగారు. వారు సాంప్రదాయ, ఆధునిక వ్యాపారాల మధ్య ఉన్న వ్యత్యాసాలకు సంబంధించి సమాధానాలు ఇచ్చారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీరామకృష్ణ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఉపయోగించుకొని ఈ ప్రాంతం నుంచి చాలా మంది అంకుర పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ సమస్యను కొంతవరకు అయినా తొలగించుటకు దోహదపడాలని అభిలషించారు. ప్యానెల్ చర్చ ముగింపు అనంతరం ప్రొ.కె.నాగభూషణ్‌రాజు, దుర్గాప్రసాద్, సీఓఓ, ఎన్. సాయికృష్ణ, డాక్టర్ పి.జ్యోతి, బి.షాహీన్‌లను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. జాతీయ గీతం ఆలాపనతో కార్యక్రమం ముగించారు. కార్యక్రమములో కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, ప్రిన్సిపల్ కేబీవీ సుబ్బయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫ్ సాయి కృష్ణ

వికలాంగులకు రక్షణ కల్పించాలని వినతి

ప్రజాశక్తి - శిరివెళ్ల
జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులకు తగిన రక్షణ కల్పించాలని వికలాంగుల ఆదరణ సేవా సమితి వ్యవస్థాపకులు జజ్జూరి మరియదాస్ జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొందరు వికలాంగులను ప్రజాసంఘాలు, మహిళా సంఘాల పేరుతో అన్యాయానికి పాల్పడుతూ, తప్పుడు ఫిర్యాదులతో బెదిరింపు ధోరణిలో ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని వికలాంగులకు రక్షణ కల్పించాలని కోరారు.

వైభవంగా స్వామి వారి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - మహానంది
మండలంలోని గాజులపల్లె గ్రామంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను ప్రసాద్ చార్యులు, రంగాచార్యులు కన్నుల పండువగా నిర్వహించారు.

ఈద్గాలో మరమ్మతు పనులు

ప్రజాశక్తి - శిరివెళ్ల
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శిరివెళ్లలోని ఈద్గాల్లో మరమ్మతులు చేపడుతున్నట్లు శిరివెళ్ల మేజర్ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ బసాపురం ఇంతియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఈద్గాలో జెసిబి ద్వారా మరమ్మతు పనులు చేయించారు. ఈద్గాల వద్ద ప్రశాంత వాతావరణం నెలకొనేలా గ్రామపంచాయతీ తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పూలే జయంతిని విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - కొత్తపల్లి
మండల కేంద్రమైన కొత్తపల్లిలో నిర్వహించనున్న జ్యోతిరావు పూలే జయంతిని విజయవంతం చేయాలని కస్టమ్స్ అధికారి వేల్పుల జయ ఆనంద్ కుమార్ కోరారు. శుక్రవారం పాత మాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, గుమ్మడాపురం, సింగరాజు పల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పలువురిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా పూలే జయంతి ఉత్సవాలను జరుపుకోవాలి అన్నారు. ఈయన వెంట సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ మల్లయ్య, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, పలువురు ఉన్నారు.


పార్క్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పార్కుల ఆధునీకరణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్
నంద్యాల పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రధాన 9 పార్కులను, 2 మినీ పార్కుల ఆధునీకరణకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో మున్సిపల్ టౌన్ హాల్ సమీపంలోని పార్క్‌ను కమిషనర్‌తో పాటు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్క్ అభివృద్ధికి రూ.15 లక్షల అంచనాలను రూపొందించి త్వరలో టెండర్ల ద్వార పనులు ప్రారంభం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తమీమ్, వైసిపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పాములపాడు
'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విజయవంతం చేయాలని మండల జేసీఎస్ ఇన్చార్జ్ ముడియాల వెంకట రమణారెడ్డి, వైసీపీ మండల నాయకులు చౌడయ్య, ఏపీ వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య,మండల కో ఆప్షన్ మెంబర్ ముర్తుజాఅలీ, నాయకులు బంగారం,రాములమ్మలు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన పాములపాడులోని వైసీపీ కార్యాలయంలో 'మా నమ్మకం నువ్వే జగన్-జగనన్నే మాభవిష్యత్' కార్యక్రమం కిట్లు, కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వంలో అందిన పథకాల గురించి క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. వైసీపీ నాయకులు పీరయ్య, ముడియాల సుబ్బారెడ్డి, షేక్షావలీ, రామస్వామి,గంటా రమేష్, ఇస్కాల మౌలాలి,మోహన్ రెడ్డి,శివలింగం,ఓబుల్ రెడ్డి, నరసింహులు, దరగయ్య, మధు,శ్రీనివాసఆచారి,తిరుపతయ్య,సుబ్బరాయుడు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు